క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



చంద్రంపాలెం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆశ

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. పీఎం పాలెం ఆర్చిడ్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ సహకారంతో రెండు రోజుల పాటు పాఠశాలలోని 3వేల మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 310మందికి సమస్యలు ఉన్నట్టు వైద్యురాలు ఆశ షేక్ గుర్తించి వారికి మందులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ములుగు వెంకటరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీ క్లోజ్ చేసినప్పుడు జాగ్రత్తలు పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న అధికారులు

మధురవాడ: పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీ క్లోజ్ చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ జోన్–2 కమిషనర్ కె. కనక మహాలక్ష్మి తెలిపారు. గ్రీవెన్స్ నిర్వహణ, అర్జీదారుల సమస్యల పరిష్కారం, గ్రీవెన్స్ క్లోజ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఎంవో ఆఫీసు నుంచి బుధవారం సదరు అధికారులు దిశానిర్దేశం చేశారు. జోన్ అధికారులు అర్జీదారులతో సంతృప్తికరంగా మాట్లాడటం లేదని 87శాతం మంది అర్జీదారులు గ్రీవెన్స్ రీడ్రెస్సల్ అథారిటీ అధికారులకు ఫోన్‌లో చెప్పినట్టు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పినట్టు తెలిపారు. దీనిపై ఆమె జోన్–2లో పలువురు అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి విభాగాధిపతీ కూడా ప్రజలతో సంతృప్తికరమైన పద్ధతిలో మాట్లాడాలని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతిరావు, ఈఈ శాంతి రాజు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మలు నరికి.. వదిలేశారు



సాగర్‌నగర్ రోడ్డుపై కుళ్లిపోయిన చెట్ల కొమ్మలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ ప్రధాన రహదారి వద్ద చెట్ల కొమ్మలను యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తొలగించేశారు. అయితే కొమ్మలను తొలగించి, అవి అలా రోడ్డుపైనే పడవేయడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. వీటి వలన రాకపోకలకు కష్టంగా ఉంటోందని, సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వీటిని తొలగించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

కొమ్మాది సర్వే నెం.153/2లో గల ప్రభుత్వ భూమిలో రెండోసారి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది





కొమ్మాది నవోదయ ఎదురుగా ప్రభుత్వ హెచ్చరిక బోర్డు తీసివేసి ఆక్రమణకు సిద్ధం చేసిన ప్రభుత్వ భూమి

యథేచ్ఛగా భూ కబ్జా

- కొమ్మాది, పరదేశిపాలెంలో అక్రమార్కుల ఇష్టారాజ్యం
- ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు
- హెచ్చరిక బోర్డులు తీసేసి మరీ దందా
- టీడీపీ పెద్దల పేరుతో వ్యవహారం
- సుమారు రూ.13 కోట్ల విలువైన భూమికి ఎసరు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో గెడ్డ భూమిలో చేపడుతున్న నిర్మాణాలు

మధురవాడ: ప్రభుత్వ భూములకు రెక్కలు వచ్చేస్తున్నాయి. మధురవాడ పరిసర ప్రాంతాల్లో భూముల విలువ కోట్లలో ఉండటంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. విశాఖ రూరల్ మండలం మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెం రెవెన్యూ గ్రామాలు, పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు, సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. కోట్లు విలువ చేసే భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కొమ్మాది, నవోదయ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాలతో పాటు తాజాగా కొద్ది రోజులుగా పరదేశిపాలెం ప్రాంతంతో గెడ్డ భూముల ఆక్రమణలే ఇందుకు నిదర్శనం.

హెచ్చరిక బోర్డులు తీసేసి..

ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు కలెక్టరు పేరుతో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు సైతం తీసేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అయినా గానీ, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకుండా రెండోసారి బోర్డులు ఏర్పాటు చేయడం, ఆ సమాచారం కూడా గోప్యంగా ఉంచడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. కోట్ల రూపాయల విలువ చేసే భూముల పరిరక్షణ పనులను కూడా గ్రేడ్–2 వీఆర్‌వోలకే అప్పగించేసి, చేతులు దులిపేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల కొమ్మాది రెవెన్యూ గ్రామం సర్వే నెం.153/2లో సుమారు రూ.10కోట్లు విలువ చేసే 70 సెంట్ల మేర ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తీసేసి మరీ అక్రమ నిర్మాణాలు చేస్తూ బహిరంగ అమ్మకాలు చేస్తుండడంతో ఓ గ్రేడ్–2 వీఆర్‌వో, వీఆర్ఏ మాత్రమే రెండోసారి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. హెచ్చరిక బోర్డులు తీసేసి మరీ ఆక్రమణకు పూనుకున్న వ్యక్తిపై చర్యలు చేపట్టకుండా, అదే ప్రాంతంలో రెండోసారి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వెనుక ఆంతర్యమేమిటో అధికారులే చెప్పాలి.

అధికార పార్టీ పెద్దల పేరుతో దందా

సర్వే నెంబరు. 153/2లో సుమారు ఎకరం ప్రభుత్వం భూమి ఉంది. ఇక్కడ ఓ వ్యక్తి తమకు అధికార పార్టీకి చెందిన పెద్దల అండ ఉందంటూ ఇప్పటికే 10వరకు ఇళ్లు, ప్లాట్లు అమ్మకాలు చేసేశాడు. ఖాళీగా ఉన్న భూమిలో కూడా అరటి, ఇతర మొక్కలు వేసి ఆక్రమణ చేస్తూ భూమిని ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేసేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

పరదేశిపాలెంలో..

పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 103లో సుమారు రూ.3కోట్లు విలువ చేసే 300గజాల గెడ్డ పోరంబోకు భూమిలో కొందరు వ్యక్తులు కొద్ది రోజులుగా అధికార పార్టీ చోటా నేతల అండతో కబ్జాకు పాల్పడుతున్నారు. కింది స్థాయి రెవెన్యూ సిబ్బంది ప్రశ్నిస్తే తాము అధికార పార్టీకి చెందిన వారమంటూ సెలవిస్తున్నట్టు సమాచారం. కొమ్మాది, పరదేశిపాలెం రెవెన్యూ గ్రామాలలో రెండు చోట్ల కలిపి సుమారు రూ.13కోట్లు విలువ చేసే భూమి అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతుంటే అధికారులు తాత్సారం చేస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి, కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి రక్షణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి వారాహి గుప్త నవరాత్రి ఉత్సవాలు



ఉమామహేశ్వరి అమ్మవారు

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత లక్ష్మీ గణపతి ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల నాల్గో తేదీ వరకు వారాహి దేవి గుప్త నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా ఉమామహేశ్వరి అమ్మవారికి ప్రతి రోజు రాత్రి మూల మంత్ర అర్చన, అష్టోత్తర నామాలు, నీరాజన మంత్రపుష్పం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి ఏడు గంటల నుంచి 8.30 గంటల వరకు ఈ పూజా కార్యక్రమాలు జరుగుతాయి. గుప్తంగా నిర్వహించనున్న ఈ ఉత్సవాల సమయంలో భక్తులకు ప్రవేశం ఉండదు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. ఆసక్తి గలవారు రూ.316 చెల్లించి తమ గోత్రనామాలు పంపాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 99126 65702, 98495 96128 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

‘జిమ్సర్’లో బొల్లి వ్యాధి నివారణ వారోత్సవాలు

కొమ్మాది: బొల్లి వ్యాధిపై అవగాహన కల్పించేందుకు గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (జిమ్సర్) చర్మ వ్యాధుల నివారణ వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ప్రొ. వీసీ డా. బి. గీతాంజలి మాట్లాడుతూ బొల్లి వ్యాధి జన్యుపరంగా వస్తుందని, అంటువ్యాధి కాదన్నారు. ఏటా కొత్తగా 8.8 శాతం జనాభా దీనిబారిన పడుతున్నారని వివరించారు. ఫొటో థెరపీ, ఎక్సైమర్ లేజర్ చికిత్స విధానాల్లో బొల్లి వ్యాధిని నయం చేయవచ్చన్నారు.

గురుకులాల్లో టాయిలెట్ల ఏర్పాటుకు వినతి



జెడ్పీకి వినతిపత్రం అందజేస్తున్న గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్

మధురవాడ: మధురవాడ జోన్‌లోని మారికవలస గిరిజన గురుకుల బాలికల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, మారికవలస తిమ్మాపురం రోడ్డులోని ఏపీ గిరిజన గురుకుల ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో విద్యార్థులకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాళ్లు శివప్రసాద్, వై. రోజా జెడ్పీ కె. కనక మహాలక్ష్మిని కోరారు. గురుకులాలకు స్థానిక సంస్థల నిధులతో మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వీరు బుధవారం జోనల్ కార్యాలయంలో జెడ్సీకి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె, చర్యలు చేపట్టాలంటూ ఈఈ శాంతి రాజుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రిన్సిపాల్స్ మాట్లాడుతూ బాలుర ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు 20 మరుగు దొడ్లు, 100మీటర్ల బాత్ రూంలకి రన్నింగ్ వాటర్ పైపులైన్, 1 సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేయడంతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన బోరు బావి నుంచి 100మీటర్ల పైపు లైనుతో పాటు 3.5 హెచ్‌పీ లిఫ్టింగ్ మోటారు అవసరం ఉందని చెప్పారు. బాలికల గురుకుల ఎస్‌వోఈకి 25 టాయిలెట్లు, 1 సెప్టిక్ ట్యాంక్, 8 కమోడ్స్ రీప్లేస్‌మెంట్, 50 మెటల్ ట్యాప్స్ అవసరం ఉందని చెప్పారు. వీటి ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

రోడ్డుపై కూరుకుపోయిన స్కూల్ బస్సు



తాళ్లవలస జెడ్పీహైస్కూల్ ముందు రోడ్డుపై కూరుకుపోయిన స్కూల్ బస్సు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జెడ్పీ హైస్కూల్ రోడ్డులో ఆనందపురం మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కార్పొరేట్ స్కూల్ బస్సు బుధవారం కూరుకుపోయింది. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు ఉన్నారు. దీనిని బయటకు తీయడానికి బస్సు సిబ్బందితో పాటు స్థానికులు శ్రమించారు. ఈ మార్గంలో ఇటీవల నారాయణ, చైతన్య కళాశాలలకు చెందిన మురుగునీరు పోవడానికి చిన్నిపేట నుంచి జెడ్పీ హైస్కూల్ వరకు భారీగా గోతులు తీసి పైపులైను వేశారు. ఈ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు రహదారి బురదగా మారిపోయింది. వివిధ విద్యాసంస్థలకు చెందిన బస్సులు ఈ మార్గంలో ఎక్కువగా వస్తున్నందున తరచూ ఈ మట్టి పూడ్చిన గోతులలో ఇరుక్కుపోతున్నాయి. దీనిపై తాళ్లవలసవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ కోసం తీసిన గోతులు సరిగా పూడ్చడంలో విద్యాసంస్థలు, పాలకవర్గం, సచివాలయ సిబ్బంది విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు.

మంత్రి పదవి కోసమే ఎమ్మెల్యే గంటా పాట్లు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బంగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: మంత్రి పదవి ఆశించి భంగపడ్డ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అప్రస్తుత వ్యాఖ్యలు చేసి ప్రజల మధ్య చులకన అవుతున్నారని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బంగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన సీనియర్ నాయకుడు రాంభక్త ప్రభాకర్‌నాయుడుతో కలిసి భీమిలిలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేగా ముందు గంటా శ్రీనివాసరావు సూపర్‌సిక్స్ హామీలు నిలబెట్టుకోవడానికి ప్రయత్నించాలన్నారు. చంద్రబాబు, లోకేష్ దృష్టిలో పడాలంటే వైఎస్ జగన్‌పై విమర్శలు మాని భీమిలి ప్రజలకు సేవలు అందించాలన్నారు. చందనోత్సవంలో ఏడుగురి మరణానికి స్థానిక ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావును, తిరుపతిలో ఐదుగురి మరణానికి చంద్రబాబును, అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి రామ్మోహననాయుడులను కూడా అరెస్ట్ చేయాలన్నారు. పార్టీలో సరైన గౌరవం లేని గంటా శ్రీనివాసరావు పక్క పార్టీల వైపు చూస్తున్నారని కేవలం మంత్రి నారాయణ ప్రోద్బలంతోనే ఉండలేక, బయటకు పోలేక టీడీపీలో కొనసాగుతున్నారన్నారు. ముందు ప్రజల దృష్టిని మళ్లించే డైవర్షన్ పాలిటిక్స్ మాని సొంత ఇంటిని చక్కదిద్దుకోవాలని హితవు పలికారు.

ఉపాధి హామీ కూలీల నోట్లో మట్టి

బినామీ మస్తర్లతో అడ్డగోలు దోపిడీ



బోని ముకుందరాజు చెరువులో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు



ఉపాధి కూలీలు తలదాచుకునేందుకు చెరువులో ఉన్న తాటాకుశాల పరిస్థితి ఇదీ..

తగరపువలస: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులలో అవినీతి తారస్థాయికి చేరుకుంది. ముఖ్యంగా ఆనందపురం మండలంలోని బోని, కుసులవాడ, శొంఠ్యాం, మామిడిలోవ తదితర పంచాయతీలలో వీఆర్పీలు అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరు ఏపీఎం నుంచి ఉన్నత స్థాయి వరకు ఉన్న అధికారుల ఆశీస్సులతోనే చిలక్కొట్టుడుకు పాల్పడుతున్నట్టు ఇటీవల పరిశీలనలో వెల్లడైంది.

డబ్బులు కాజేసి వాటాలు

బినామీ మస్తర్లతో ఒక్కో పని వద్ద 10 నుంచి 15 మంది పేర్లు నమోదు చేసి, వారి పేరుతో డబ్బులు కాజేసి వాటాలు వేసుకుంటున్నారు. ఈ బినామీ పేర్లలో మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు, విద్యార్థులు ఉన్నట్టు తెలిసింది. కొన్ని చోట్ల పనివేళలతో సంబంధం లేకుండా వర్షం పడుతున్న సమయంలోనూ పనులు చేయిస్తున్నట్టు తప్పుడు లెక్కలు నమోదు చేస్తున్నారు. ఆయా చోట్ల జరుగుతున్న ఉపాధి హామీ పనులలో భారీగా అవినీతి జరుగుతున్నట్టు ఆరోపణలతో కూటమి నాయకుల మధ్య విభేదాలు కూడా పొడసూపుతున్నాయి. అయినప్పటికీ గ్రామ పరువు, ప్రతిష్టల పేరుతో బయటకు పొక్కనీయడం లేదు. బినామీ మస్తర్లపై వీఆర్పీలను ప్రశ్నించగా మూడు నుంచి అయిదు పేర్లు లేకపోతే గ్రామాలలో పనులు చేయించలేమని బహిరంగంగా ఒప్పుకుంటున్నారు. దీనిని బట్టి చూస్తే అవినీతి ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది.

పని ప్రదేశంలో వసతులు శూన్యం

పని ప్రదేశంలో ఎక్కడ చూసినా జాబ్ కార్డులు కనిపించడం లేదు. అసలు కూలీలకు తాము ఎంత పనిచేస్తున్నారో? ఎంత డబ్బులకు పని చేశారో? ఎన్నిరోజులు పనికి వచ్చారో కూడా తెలియడం లేదు. మేట్‌లు మాత్రం అప్పుడప్పుడు వర్షాలు పడుతున్నందున జాబ్ కార్డులు తమ ఇంటి వద్ద ఉంచుతున్నామని, పనులు పూర్తయిన తరువాత ఇంటికి వెళ్లి నమోదు చేస్తున్నట్టు తెలియజేస్తున్నారు. అలాగే పని ప్రదేశంలో ప్రథమ చికిత్సకు అవసరమైన మెడిసిన్, తలదాచుకోవడానికి టెంట్లు కూడా లేవు. ఇటీవల ఎండలకు చెట్ల కింద, ఎండిన తాటాకుల కింద సేదతీరేవారు. ప్రస్తుతం వర్షాలకు తలలు తడిచి సీజనల్ వ్యాధుల బారిన కూడా పడుతున్నారు. ఉదయం 5.30కు పని ప్రదేశంలోకి చేరుకుని 6 గంటలకు పని ప్రారంభించి 9.30 వరకు పని చేయవలసి ఉండగా ఎక్కడా ఈ పనివేళలు పాటించడం లేదు. వీటిని ప్రశ్నించిన కూలీలను పనులలోకి రావద్దని మేట్‌లు, వీఆర్పీలు జులుం ప్రదర్శిస్తున్నారు. 6 నుంచి 7 వారాలుగా పని చేసిన డబ్బులు ఇంకా రావలసి ఉన్నందున ఆకలితో పనులకు వెళ్తున్నట్టు వాపోతున్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట అవినీతిని అరికట్టి పారదర్శకంగా పనులు నిర్వహించాలని.. వసతులు కల్పించి సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని కూలీలు కోరుతున్నారు. ఏరోజుకారోజు జాబ్‌కార్డులలో వివరాలు నమోదు చేసి తమ చేతికే వాటిని అందించాలని అడుగుతున్నారు.

వెలగని వీధి లైట్లు



కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డులో వెలగని వీధిలైటు

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి పాత రోడ్డు మలుపు మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డులో వీధిలైట్లు వెలగకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లడానికి ఇది దగ్గరి దారి. దీంతో చాలామంది ఆ మార్గంలో ప్రయాణిస్తుంటారు. రాత్రి సమయంలో ఆ రోడ్డు చిమ్మ చీకటిగా ఉండటంతో మహిళలు, వృద్ధులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించవలసి వస్తోందన్నారు. వెంటనే వీధి దీపాలు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

తెరిపివ్వని వాన

రహదారులు జలమయం



చంద్రంపాలేనికి వెళ్లే సర్వీసు రోడ్డులో నిలిచిన వాన నీరు

పీఎం పాలెం: రెండు రోజులుగా కుర్తున్న వర్షాల కారణంగా పీఎం పాలెం చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బుధవారం మధ్యాహ్నం 1 గంట నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. గాయత్రీ నగర్, ఆర్‌హెచ్ కాలనీ ముస్లిమ్ కాలనీ, బీ–1 కాలనీ తదితర ప్రాంతాల ప్రజల జన జీవనం స్తంభించింది. కారుషెడ్ నుంచి కొమ్మాది వైపునకు వెళ్లే సర్వీసు రోడ్లలో వాననీరు పొంగి పొర్లింది. మధ్యాహ్నం నుంచి కొంతమంది షాపులు బంద్ చేశారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు వర్షం కారణంగా అవస్థలు పడ్డారు.



ముచ్చర్ల పంచాయితీలో చెరువుగా మారిన రహదారి

చిత్తడిగా రోడ్లు

తగరపువలస: ఇటీవల వర్షాలకు గ్రామీణ ప్రాంత రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులలో రహదారులకు మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేకపోయింది. తరువాత పలుమార్లు విజయదశమి, ఎమ్మెల్సీ ఎన్నికలు, సంక్రాంతి పేర్లతో వాయిదాలు వేసినా గ్రామీణ రహదారులను తీర్చిదిద్దలేక విఫలం అయ్యారు. నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీలో ఇలాంటి అధ్వాన రహదారులతో స్థానికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా అటకఎక్కించిందని గ్రామస్తులు అంటున్నారు. గ్రామీణ రహదారులకు మోక్షం కలిగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కోతలు.. సాంకేతిక తిప్పలు

‘తల్లికి వందనం’లో సిత్రాలివీ..



తగరపువలస: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న తీరుకు పొంతన లేకుండా పోయింది. ‘తల్లికి వందనం’పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ.15,000 చొప్పున ఇస్తామన్న కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు నిబంధనల పేరుతో లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. మాట నిలబెట్టుకోకపోగా.. సాంకేతిక లోపాల పేరుతో అర్హులకు సైతం అన్యాయం చేస్తూ తల్లుల ఆశలపై నీళ్లు చల్లుతోంది.

‘ఎవ్వరికీ ఎగ్గొట్టం’అన్నారు.. ఇప్పుడేమో.?

‘మీ ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ రూ.15 వేల చొప్పున ఇస్తాం. ఒకరుంటే రూ.15 వేలు.. ఇద్దరుంటే రూ.30 వేలు, నలుగురుంటే రూ.60 వేలు ఇస్తాం’అని ఎన్నికల ప్రచారంలో నారా చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ‘నిబంధనల సాకుతో ఎవరికీ ఎగ్గొట్టం’అంటూ నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ మాటలు నమ్మిన తల్లులకు ఇప్పుడు ఎదురవుతున్నవి కోతలు, కష్టాలే.

తొలి ఏడాది గుండు సున్నా..!

అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం మాట మార్చింది. తొలి ఏడాది పథకాన్ని అమలు చేయకుండా ఎగ్గొట్టేసింది. ఎట్టకేలకు ఈ ఏడాది తల్లికి వందనం అమలు చేయగా.. అనేక నిబంధనలు విధించి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. హామీ ఇచ్చినా పూర్తి మొత్తం అందకపోవడం, సాంకేతిక సమస్యలతో అర్హుల జాబితా నుంచి పేర్లు గల్లంతవ్వడం వంటి ఘటనలతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ సిత్రాలు ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టం చేస్తున్నాయి.


కోతలతో జమ

జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేటలో తెలుగు రామలక్ష్మి, మద్దిల చిట్టితల్లి, అడివరపు పుష్పలత అనే మహిళల ఖాతాలకు రూ.13 వేలకు బదులుగా రూ.10,900 వంతున జమ అయ్యాయి. ఒక్కొక్కరికి రూ.2,100 కోత విధించడంపై బాధితులు ప్రశ్నిస్తే.. ‘ఎంత పడితే అంతే’అంటూ సచివాలయ సిబ్బంది, బ్యాంకర్లు సమాధానమిస్తున్నారు. ఇచ్చిన హామీకి, జమ అవుతున్న మొత్తానికి పొంతన లేకపోవడంపై తల్లులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్ అనుసంధానంతో అనర్హత

సంతపేటకు చెందిన బోని ఈశ్వర్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రేష్ట 2వ తరగతి, సాత్విక 5వ తరగతి చదువుతున్నారు. ఆయన ఆధార్ నంబర్‌కు అదనంగా వేర్వేరు ఇంటి పేర్లు కలిగిన అయిదుగురు ఈశ్వర్ పేర్లు లింక్ అయ్యాయి. దీంతో ఆయన విద్యుత్ వాడకం నెలకు 150 యూనిట్లు దాటకపోయినా, రికార్డుల్లో 900 యూనిట్లుగా చూపిస్తోంది. ఈ సాంకేతిక తప్పిదం కారణంగా ఆయన పిల్లలకు పథకం అందలేదు. వారం రోజులుగా ఆయన విద్యుత్ కార్యాలయం, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా డీలింక్ కావడం లేదు. అలాగే, ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ గుమ్మడివానిపాలెం గ్రామానికి చెందిన బొత్స రాము, అతని భార్య లక్ష్మి ఆధార్ నంబర్లకు ఏపీఈపీడీసీఎల్‌కు బదులు చిత్తూరు జిల్లా పరిధిలోని ఏపీఎస్‌పీడీసీఎల్‌కు సంబంధించిన బిల్లులు అనుసంధానం అయిపోయాయి. దీంతో విద్యుత్ బిల్లు రూ.2 వేలు దాటిందని చూపి, ఇంటర్ చదువుతున్న కుమారుడికి పథకం వర్తించలేదు. దీంతో బాధితులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఒకవైపు సాంకేతిక లోపాలను సరిదిద్దడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతుంటే.. మరోవైపు ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో నిలబెట్టుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల నాటి మాటలకు, నేటి చేతలకు పొంతన లేదని, ‘తల్లికి వందనం’పథకం తల్లులకు ఆనందం బదులు ఆవేదననే మిగులుస్తోందని బాధితులు వాపోతున్నారు.



బొత్స రాము, అతని భార్య లక్ష్మి ఆధార్ నంబర్లకు చిత్తూరు పరిధిలో అనుసంధానమైన బిల్లులు

జగన్నాథుడి రథయాత్ర రేపు

ఎంవీపీకాలనీ: ఈ నెల 27న హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం నుంచి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఈ యాత్ర ప్రారంభమవుతుంది. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు మీదుగా టీటీడీ కూడలి, ఇసుకతోట జంక్షన్, వెంకోజిపాలెం కూడలి, క్యాన్సర్ హాస్పిటల్, అప్పుఘర్ బీచ్ రోడ్డు మీదుగా రథయాత్ర సాగి.. తిరిగి ఐఐఏఎంకు చేరుతుంది. యాత్రలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, జగన్నాథ మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.